## క్లుప్తంగా

### నేడు మంత్రి పర్యటన

**మల్హర్:** మండలంలోని తాడిచర్ల గ్రామంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేడు(ఆదివారం) పర్యటించనున్నట్లు ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్యలు శనివారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు.. తాడిచర్ల నూతన తహసీల్దార్ భవనం, మల్లారం కస్తూరిబా గాంధీ హాస్టల్ భవనంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్



**చిట్యాల:** ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును నూతనంగా వచ్చిన తహసీల్దార్ ఎండీ. మోహీయుద్దీన్ శనివారం జడల్‌పేట వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఆర్‌ఐ రాజు ఉన్నారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం



**కాటారం:** మండలంలోని ధన్వాడకు చెందిన వైద్యుడు సుంకు రమేశ్ బహుజన సాహిత్య అకాడమీ ద్వారా వైద్యరత్న అవార్డు పొందగా శుక్రవారం రాత్రి ధన్వాడలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అల్లాడి శ్రీనివాస్, చంద్రమౌళి, మహేశ్, జంగిలి నరేశ్, బీరెల్లి అంజయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### చిట్యాల ఎస్సైగా శ్రావణ్‌కుమార్



**చిట్యాల:** చిట్యాల ఎస్సైగా గంధమనేని శ్రావణ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై జంగిలి రమేష్ భూపాలపల్లి సీసీఎస్‌గా బదిలీపై వెళ్లారు. అలాగే భూపాలపల్లి సీసీఎస్‌లో పని చేసిన శ్రావణ్‌కుమార్ చిట్యాలకు బదిలీపై వచ్చారు.

### ఎంపీ టికెట్ 'దొమ్మాటి'కి ఇవ్వాలి

**ఆత్మకూరు :** కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ దొమ్మాటి సాంబయ్యకు కేటాయించాలని పరకాల యూత్‌కాంగ్రెస్ అసెంబ్లీ కన్వీనర్ మాదాసి శ్రీధర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో శక్తివంచన లేకుండా పనిచేసిన దొమ్మాటి సాంబయ్యకు ఎంపీ టికెట్ ఇస్తే గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

# ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం..



టేకుమట్ల: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాలలో..

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**టేకుమట్ల:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రం నుంచి చిట్యాల మండలం నవాబుపేట వరకు రూ.5కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి, అలాగే మండలంలోని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహారి నిర్మాణానికి రూ.5లక్షల నిధులు, 108 వాహన షెడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, వెలిశాల కబరస్తాన్ ప్రహారి నిర్మాణానికి రూ.10లక్షలతో శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 90 రోజుల్లోనే ఎంతో అభివృద్ధి పనులు చేయడంతో పాటు ఇచ్చిన హామీలను సైతం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. మరో రెండు గ్యారంటీలను సైతం త్వరలోనే అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాదర్ల అశోక్, మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, బండ శ్రీకాంత్, జంగ మధూకర్, చింతలపెల్లి స్వామిరావు, తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**

**చిట్యాల:** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో రూ.80లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జూకల్ గ్రామంలో రూ.20లక్షలతో సీసీ రోడ్డుతో పాటు రూ.10లక్షల నిధులతో నిర్మించనున్న మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే చిట్యాలలో రూ.5 లక్షలతో కాంపౌండ్ నిర్మాణం, రూ.10లక్షలతో బస్టాండ్ ఆవరణంలో సీసీ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే జడల్‌పేట గ్రామంలో రూ.10లక్షలతో మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే భీష్మనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతుల కోసం రూ.5లక్షల పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే అందుకుతండా గ్రామంలో రూ.5 లక్షలు, ఒంటిప్పతండాలో రూ.5లక్షలు నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెంచరామి గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ కాంపౌండ్ నిర్మాణానికి రూ.5లక్షలు, ప్రాథమిక పాఠశాల కాంపౌండ్ నిర్మాణం కోసం రూ.5లక్షల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈఓ ఎల్. విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రామయ్య, ఎంపీఓ రామకృష్ణ, ఎంపీఎం మంజుల, పీఆర్ ఏఈ తిరుపతి, మండల పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ ఓరం సమ్మయ్య, జిల్లా , మండల నాయకులు గుమ్మడి శ్రీదేవి, దొంతి రాంరెడ్డి, సూర నరేందర్, పోలోజు సంతోష్, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొమురు, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, కామిడి రత్నాకర్‌రెడ్డి, సిద్దంకి భాస్కర్, మల్లేష్, సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న పాపయ్య

**రేగొండ:** రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నెంపల్లి పాపయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాపయ్య పాల్గొని మాట్లాడుతూ.. బూత్ స్థాయి కార్యకర్తలు, అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ నెల 12న హైదరాబాద్‌లో జరిగే బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొంటారని తెలిపారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకుని మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు, జిల్లా మాజీ అధ్యక్షుడు కన్న యుగదీశ్వర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాలసాని తిరుపతి రావు, జిల్లా నాయకులు గన్‌రెడ్డి లింగారెడ్డి, ముష్క నరేందర్, మండల ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు, నాయకులు బండి శ్రీను, కూరాకుల మల్లయ్య, మాచార్ల వరప్రసాద్, తాళ్లపల్లి సుధాకర్ గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తస్లీమా మహ్మద్

**ములుగు:** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు(ఆదివారం) జిల్లాకేంద్రంలోని సాధన హైస్కూల్ పక్కన ఉన్న ఆవరణలో సర్వర్ చారిట్రబుల్ ట్రస్టు, ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన సభను విజయవంతం చేయాలని ఆ ట్రస్టు చైర్‌పర్సన్, మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పిలునిచ్చారు. శనివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉదయం 10గంటల 30 నిమిషాల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్నారు. మహిళల సాధికారిత, చట్టాలు, స్వయం సహాయక రంగాల్లో రాణించడం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. కళాకారుల మధ్య సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# గోదావరి జలాలను తరలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

**నర్సంపేట:** మండలంలోని మాధన్నపేట పెద్ద చెరువులోకి గోదావరి జలాలను తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి, రైతు సంఘం జిల్లా నాయకుడు కేశెట్టి సదానందం డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధన్నపేట పెద్దచెరువు కింద పెద్ద కాలువ తైబందీ సుమారు 900 ఎకరాలు పంటకు నీరు అందించడానికి తైబందీ ఖరారు కాగా రైతులు నాట్లు వేశారని తెలిపారు. కానీ ఇప్పుడు తీరా చూస్తే మాధన్నపేట పెద్ద చెరువులో నీరు రోజురోజుకు అడుగంటుతుందని, మరికొద్ది రోజుల్లోనే పెద్ద తూముకు నీరందే అవకాశం లేదన్నారు. ఇప్పటికే రైతులు అప్పులు తెచ్చి దాదాపు 80 శాతం పెట్టుబడి పెట్టారని, నదీ జలాలు చెరువులోకి రాకుంటే పంటలు ఎండిపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ చూపి నది జలాలను చెరువులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ), రైతు సంఘం ప్రజా సంఘాల నాయకులు అనుమాల రమేష్, కలకోట్ల యాదగిరి, మార్త నాగరాజు, సుధా, రాజేందర్, కేశెట్టి శ్రీనివాస్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వ సాధనకు పోరాడుదాం..



సమావేశంలో మాట్లాడుతున్న కాసు మాధవి

**నర్సంపేట:** మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా, మహిళా సమానత్వ సాధనకు పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి అన్నారు. పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాడు సమానత్వం కోసం పోరాడి అమరులైన వీరవనితల బలిదానం రోజునే ఈ రోజు మహిళా దినత్సోవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు అనేక రంగాల్లో పురుషులతో పోటీ పడుతూ రాణిస్తూ అందరికి ఆదర్శంగా ఉంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా అన్ని వర్గాల ప్రజలు, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా స్త్రీ సమానత్వం కోసం, వారికి ఉన్న చట్టాల అమలు, వారి హక్కుల కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు వజ్జంతి విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, బి.లక్ష్మి, యాకలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకులు హన్మకొండ శ్రీధర్, కందికొండ రాజు, డీవైఎఫ్ఐ నాయకులు కలకోట అనిల్, విజయం కేరి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవం



కాటారం: సన్మానిస్తున్న మిత్వాగ్రేస్ మినిస్ట్రీస్ సభ్యులు



మొగుళ్లపల్లి: కేక్ కట్ చేస్తున్న మహిళలు

**కాటారం:** మండల కేంద్రంలోని గారెపల్లి షాలేమా ప్రార్థనా మందిరంలో మిత్వాగ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సీనియర్ పాస్టరమ్మ మాతంగి సుశీలమ్మను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్వాగ్రేస్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు ప్రవీణ్, సెక్రటరీ కాట్రు ప్రభాకర్, కోశాధికారి నవీన్, శ్రీధర్, శేషారాణి, నాగమణి, పాస్టర్ డేవిడ్‌మార్క్, ఐదు మండలాల పాస్టర్లు, మహిళా పాస్టర్లు పాల్గొన్నారు.

**టేకుమట్ల:** మండలంలోని సోమనపల్లి ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ తిరుమల, ఆశ కార్యకర్త రమాదేవి, అంగన్‌వాడీ ఆయా రాజమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు కొమురమ్మలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి, పంచాయతీ కార్యదర్శి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

**అన్ని రంగాల్లో మహిళల ముందంజ**

**మొగుళ్లపల్లి:** నేటి కంప్యూటర్ యుగంలో మహిళలు పురుషులతో పాటు సమానంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ జయశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్త్రీ ఇంటితో పాటు దేశాన్ని, సమాజాన్ని అభివృద్ధి చేస్తుందన్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళా నేడు అంతరిక్షంలోకి అడుగు పెట్టి గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేసిందన్నారు.రాజకీయంగా స్త్రీలు రాష్ట్రాన్ని శాసించే స్థాయికి ఎదిగారన్నారు. స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



టేకుమట్లలో..



చిట్యాల: ఎంపీపీని సన్మానిస్తున్న అధికారులు

**చిట్యాల:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు శనివారం ఎంపీడీఓ రామయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దావు వినోద, ఐకేపీ ఏపీఎం మంజుల, సూపర్‌వైజర్ జయప్రద, ఏఎన్ఎం సుమలత, మహిళా కానిస్టేబుళ్లు కోమల, ఏ.మమత, మమత, పంచాయతీ కార్యదర్శులు సునీత, మానస, టీఏ అపర్ణ, జీపీ సిబ్బంది పుల్ల సారమ్మ, సమ్మక్కలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రామకృష్ణ, సూపరింటెండెంట్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## టేకు కలప స్వాధీనం



టేకు దుంగలను తరలిస్తున్న సిబ్బంది

**మహదేవపూర్:** మండలంలోని సూరారం, అంబట్‌పల్లి గ్రామల సమీపంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్ఓ కమల శనివారం తెలిపారు. ఎఫ్ఆర్ఓ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి అక్రమంగా టేకు కలపకు తరలిస్తున్నారనే సమాచారం ఎఫ్‌డీఓ వజ్రారెడ్డికి రావడంతో సూరారం అంబట్‌పల్లి సెక్షన్ల సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బందితో తనిఖీ చేశామన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంతో గాలింపు చేపట్టగా రెండు ఎడ్లబండ్లలో టేకు కలప కనిపించిందన్నారు. కాగా బండ్లను విడిచి నిందితులు ఎడ్లతో పారిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు 25 టేకు దుంగలను స్వాధీనం చేసుకోని మహదేవపూర్‌లోని కలప డిపోకు తరలించినట్లు తెలిపారు.

# ప్రజలను ఇబ్బంది పెడితే ఉపేక్షించం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

**పరకాల :** పదవులను అడ్డుపెట్టుకొని ప్రజలను ఇబ్బంది పెడితే ఏ స్థాయి నాయకులనైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి పరకాల నియోజకవర్గంలో 20 వేల ఓట్ల మెజారిటీ వచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పరకాల పట్టణ, పరకాల, నడికూడ, ఆత్మకూరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పెరిగిన ఆదరణ చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, కౌన్సిలర్ జయమ్మ, పరకాల మండల, పట్టణ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 13న వేలంపాట

**శాయంపేట :** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 7 షెటర్లు, కూరగాయల మార్కెట్‌కు ఈనెల 13న వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సుభాషిణి, ఎంపీఓ రంజిత్‌కుమార్ శనివారం తెలిపారు. 2024–25 సంవత్సరానికిగాను షాపింగ్ కాంప్లెక్స్, కూరగాయల మార్కెట్ వేలంపాటను ఉదయం 9గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు షాపింగ్ కాంప్లెక్స్ డిపాజిట్ రూ. 10వేలు, తైబజార్ డిపాజిట్ రూ. 30వేలు ఈనెల 12న సాయంత్రం 5గంటలలోపు చెల్లించాలని తెలిపారు. వేలంపాటలో టెండర్ దక్కించుకున్న వారు అదేరోజు 50శాతం డబ్బులు గ్రామపంచాయతీకి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

# వైభవంగా శివపార్వతుల కల్యాణం



వెంకటాపురం(కె): కల్యాణం తిలకిస్తున్న భక్తులు



వెంకటాపురం(కె): కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఏటూరునాగారంలో..



ఏటూరునాగారం: ఊరేగిస్తున్న శివపార్వతుల సేవ వసంతోత్సవం

**వెంకటాపురం(కె):** మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి వారి కల్యాణం శుక్రవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో మంగళవాయిద్యాల నడుమ కన్నుల పండుగగా నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచకం, రక్షాబంధనం, అంకురార్పణ, ధ్వజరోహన పూజలు జరిపించారు. ఉత్సవ పందిరి వద్ద ఆలయ కమిటీ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటలకు స్థానిక వేప చెట్టు సెంటర్‌లో ఎదురు కోలు సన్నాహక కార్యక్రమం చేశారు. మండల పరిధిలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సమక్షంలో రాత్రి 11 గంటల నుంచి స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారికి పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నరు. మండలంలోని పలు గ్రామాల నుంచి స్వామివారి కల్యాణం తిలకించెందుకు భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

**వాజేడు:** మండల పరిధిలోని జంగాలపల్లి, ప్రగళ్లపల్లి, అయ్యవారిపేట గ్రామాల్లో శివ పార్వతుల కల్యాణ మహోత్సవం శుక్రవారం అర్ధరాత్రి 12.00 గంటల సమయంలో ఘనంగా నిర్వహించారు. జంగాలపల్లిలోని సతీసమేత ఉమా రామలింగేశ్వర స్వామికి ఉత్సవ కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఉత్సవాన్ని వీక్షించారు. ప్రగళ్లపల్లి గ్రామంలో గ్రామస్తులు స్థానిక శివాలయం వద్ద శ్రీ కాశీఉమారామ లింగేశ్వరస్వామి పెళ్లిని అంగరంగ వైభవంగా చేశారు. పాత అయ్యవారిపేట గ్రామంలో గోదావరి నది సమీపంలో ఉన్న కాకతీయుల కాలంలో నిర్మించబడిన శివాలయంగా చెప్ప బడుతున్న ఇక్కడ శివ పార్వతుల కల్యాణంను కమనీయంగా జరిపించారు.

**ఏటూరునాగారం:** మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా అర్చకులు సిద్దాంతిశర్మ, రాజ్‌కుమార్, ఉదయచార్యులు జరిపించారు. శనివారం ఉదయం గ్రామ పురవీధుల్లో వసంతోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక సేవలో ఏర్పాటు చేసుకొని ఊరేగించారు. భక్తులు స్వామి వారికి స్వాగతం పలుకుతూ నీళ్లు ఆరబోశారు. సన్నాయి మేళాలలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ప్రసాద్, తిరుపతి, నర్సింహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

**మల్లన్న కల్యాణ వేడుకలు**

మండల కేంద్రంలోని శ్రీ కొమరవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కొమరవెల్లి మల్లన్న, బలిజమేడలమ్మలకు కల్యాణ వేడుకలను శనివారం తెల్లవారుజామున అర్చకులు యల్లాప్రగడ సూర్యనారాయణశర్మ ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు గోగు జ్యోతి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీని కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ మధుసూదనాచారితో నాయకులు

**శాయంపేట :** మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, సిరికొండ యువసేన సభ్యులు శనివారం మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని శనివారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో జరుగుతున్న రాజకీయ సమీకరణలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యువజన నాయకులు బేరుగు రాకేష్, మాస్కుల రాజు, శ్రీనివాస్, ప్రదీప్ ఉన్నారు.